# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శనివారం - 14 - మార్చి - 2026 | సంపుటి : 3 | సంచిక : 285 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



## మూసీ ప్రాజెక్టును వ్యతిరేకించడం భవిష్యత్ తరాలకు అన్యాయం

మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును బీఆర్ఎస్, బీజేపీ నేతలు కావాలనే వ్యతిరేకిస్తున్నారని సీఎం విమర్శ

మూసీ పక్కన 3 నెలలు ఉంటే ప్రజల సమస్య తెలుస్తుందని ప్రతిపక్ష నేతలకు సవాల్

పరివాహక ప్రాంతంలోని 10 వేల కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఉపాధి ప్రణాళికలు ప్రకటించిన ప్రభుత్వం

2లో





## మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత

అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోలీస్ వ్యవస్థలో విశేష సేవలు

నక్సలిజం అణచివేతలో కీలక పాత్ర

2లో

## మూసీ ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌కు
# హరీష్‌రావు 8 ప్రశ్నలు

మూసీ సుందరీకరణపై స్పష్టత కోరిన బీఆర్ఎస్ నేత

పేదల ఇళ్ల కూల్చివేతపై విమర్శలు

డీపీఆర్ లేకుండానే చర్యలేమిటని ప్రశ్న



**హైదరాబాద్, 13 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** మూసీ బ్యూటిఫికేషన్ అంశంపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎనిమిది సూటి ప్రశ్నలు సంధించారు. ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం మూసీ బ్యూటిఫికేషన్ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ప్రెజెంటేషన్ ఇస్తున్న నేపథ్యంలో ముందుగా ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని హరీష్‌రావు అన్నారు. మూసీ పునరుజ్జీవనానికి తమ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని హరీష్‌రావు స్పష్టం చేశారు. అయితే సుందరీకరణ పేరిట వేలాది మంది పేదలను నిరాశ్రయులుగా చేయడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలోనే మూసీ సుందరీకరణకు శ్రీకారం చుట్టామని, సుమారు నాలుగు వేల కోట్లతో 32 శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు.

మిగతా 2లో..



## ఆర్టీసీ సమ్మె నోటీసులు

- ప్రభుత్వానికి ఉద్యోగుల హెచ్చరిక
- 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ డిమాండ్
- బకాయిల విడుదలపై ఆర్టీసీ జేఏసీ ఆందోళన

**హైదరాబాద్, 13 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సహా పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నోటీసులు సమర్పించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు దిగుతామని ఉద్యోగులు హెచ్చరించారు. ఆర్టీసీ ఎండీ అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యాలయ పేషీలోనే సమ్మె నోటీసులను జేఏసీ నేతలు సమర్పించారు. అదేవిధంగా లేబర్ కమిషనర్ కార్యాలయంలో కూడా నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సమ్మె తేదీపై 14 రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆర్టీసీ జేఏసీ నాయకులు వెల్లడించారు.

మిగతా 2లో..

## అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు అధికారులకు సీఎస్ ఆదేశాలు

సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేయాలని సూచన

టెలీకాన్ఫరెన్స్ ద్వారా శాఖలతో సమీక్ష.. ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్న సమావేశాలు



2లో

## మెదక్ ప్రభుత్వ దవాఖానలో ఏసీబీ దాడులు

- ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించిన అధికారులు
- రికార్డులను పరిశీలిస్తున్న దర్యాప్తు బృందం
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో అక్రమాల ఆరోపణలు

2లో

## బీరోలు గ్రామ అభివృద్ధికి రూ.29.92 కోట్లు: పొంగులేటి

- పాలేరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- వరద బాధితులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ
- రంజాన్ సందర్భంగా ముస్లింలకు తోఫా పంపిణీ



2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# మూసీ ప్రాజెక్టును వ్యతిరేకించడం భవిష్యత్ తరాలకు అన్యాయం

**హైదరాబాద్, 13 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టును వ్యతిరేకించడం అంటే భవిష్యత్ తరాలకు అన్యాయం చేయడమే అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. మూసీ నదిని బీఆర్ ఎస్, బీజేపీ నేతలు కావాలనే వ్యతిరేకిస్తున్నారని.. ఒక్క సరైన కారణం కూడా చెప్పట్లేదని సీఎం విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నదులను అక్కడ పునరుద్ధరించారు కానీ.. ఇక్కడ వ్యతిరేకించడం ఏంటని మండిపడ్డారు. మూసీ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న బీఆర్ ఎస్, బీజేపీ నేతలకు కంటైనర్ హౌస్ లు ఇస్తానని.. 3 నెలల పాటు మూసీ పక్కన ఉంటే అప్పుడు ప్రజల సమస్య తెలుస్తుందన్నారు సీఎం రేవంత్. 200 మందికైనా తాను వసతి ఏర్పాటు చేస్తానని.. ముందుకు రావాలని సవాల్ విసిరారు సీఎం రేవంత్. మూసీ పక్కన ఎవరూ ఉండలేని పరిస్థితి వచ్చిందని.. అలాంటిది బీఆర్ ఎస్, బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తున్నాయంటూ రేవంత్ మండిపడ్డారు. మూసీ పరివాహక ప్రాంతాల ప్రజల సమస్యలు తాను కండ్లారా చూశాను కాబట్టే ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతున్నట్టు చెప్పారు సీఎం. మూసీ పక్కన ప్రస్తుతం 10వేల కుటుంబాలు ఉన్నాయన్నారు. వారందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించామని.. ఉపాధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నట్టు చెప్పారు. 'మూసీ ప్రాజెక్టుపై ఎన్నో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. గాంధీ విగ్రహం కోసం రూ.5వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని తప్పుడు ప్రచారం చేశారు. కానీ మేం ఖర్చు పెడుతున్నది రూ.70 కోట్లే. ప్రాజెక్టు మొదటి దశ పనుల కోసం రూ.5 వేల కోట్ల నుంచి రూ.6వేల కోట్ల దాకా ఖర్చు అవుతాయి. కానీ రకరకాల బడ్జెట్ చెబుతూ తప్పుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. మూసీ నదిని ఎవరు అడ్డుకున్నా ఆపేది లేదు' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

# మూసీ ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌కు హరీష్‌రావు 8 ప్రశ్నలు

(మొదటి పేజీ తరువాయి)

గోదావరి నీటిని తీసుకొచ్చి మూసీని శుద్ధి చేయాలనే ప్రణాళిక కూడా రూపొందించామని పేర్కొన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహార శైలి తుగ్లక్ పాలనను గుర్తు చేస్తోందని హరీష్‌రావు విమర్శించారు. ఒకసారి మూసీ సుందరీకరణ, మరోసారి మూసీ ప్రక్షాళన, ఇంకోసారి పునరుజ్జీవం అంటూ పేర్లు మారుస్తూ ప్రజల ఇళ్లను కూల్చే హక్కు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే ముందుగా మురుగు నీటి సమస్యను పరిష్కరించాల్సి ఉందని అన్నారు. ఖజానా ఖాళీ అని చెబుతూనే లక్షా యాభై వేల కోట్ల రూపాయల టెండర్లు ఎలా పెట్టారని హరీష్‌రావు ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ఫైవ్ స్టార్ హోటళ్లలో కూర్చొని నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదన్నారు. సరైన ప్రణాళికలు, వివరాలు లేకుండా ప్రజల ఇళ్లను కూల్చడం దారుణమని పేర్కొన్నారు. డీపీఆర్ లేకుండానే పేదలకు నోటీసులు ఇవ్వడం ఎలా సాధ్యమైందని హరీష్‌రావు ప్రశ్నించారు. బఫర్ జోన్‌ను ఎలా నిర్ణయించారో స్పష్టత ఇవ్వాలని, వరద నీటి అధ్యయనాలు చేశారా లేదా వెల్లడించాలని కోరారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రుణం మంజూరైందని అసెంబ్లీలో చెప్పిన విషయంపై కూడా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఇప్పటికే కూల్చివేసిన ఇళ్లకు సరైన పరిహారం ఇవ్వలేదని హరీష్‌రావు ఆరోపించారు. మధురిడ్జ్ అపార్ట్‌మెంట్ వాసులకు ఇచ్చిన హామీ మాదిరిగానే మిగతా కాలనీల ప్రజలకు కూడా స్థలాలు ఇస్తారా అని ప్రశ్నించారు. అలాగే మెట్రో స్టేషన్లు, బస్టాండ్లు, దేవాలయాలు వంటి నిర్మాణాలపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో స్పష్టం చేయాలని కోరారు. మూసీ ప్రాంత బాధితులను హౌస్ అరెస్టు చేయడం ఎందుకని ప్రశ్నించిన హరీష్‌రావు, మూసీ పేరిట జరుగుతున్న రియల్ ఎస్టేట్ దందాకు ఎవరు మద్దతు ఇస్తున్నారో వెల్లడించాలని ప్రభుత్వాన్ని నిలదీశారు.

# బీరోలు గ్రామ అభివృద్ధికి రూ.29.92 కోట్లు: పొంగులేటి

**ఖమ్మం, 13 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ప్రజాప్రభుత్వం ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు, రాకాసి తండా, బంధంపల్లి గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు అధికారులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. అకేరు వరదలతో ప్రభావితమైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రి పంపిణీ చేశారు. బీరోలు గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దమ్మాయిగూడెంలో నిర్వహించిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొని నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను అభినందించారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మసీదు కమిటీ



లకు చెందిన ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ తోఫాను అందించారు.

గత రెండున్నరేళ్లలో బీరోలు గ్రామ అభివృద్ధికి రూ.29.92 కోట్ల నిధులు ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. రూ.2.59 కోట్లతో బీరోలు నుంచి ఏలువారిగూడెం వరకు రహదారి, రూ.64 లక్షలతో ఎస్సీ కాలనీలో అంతర్గత రోడ్లు నిర్మించినట్లు పేర్కొన్నారు. అలాగే దమ్మాయిగూడెం నుంచి సోలిపురం వరకు రోడ్డు పనులు, ఐనవోలు బ్రిడ్జి నిర్మాణానికి రూ.5.50 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు.

అదేవిధంగా రూ.6.50 కోట్లతో తెడ్డెలపాడు నుంచి బీరోలు వరకు తారు రోడ్డు, రూ.30 లక్షలతో బీరోలు నుంచి మేడినపల్లి వరకు రహదారి, రూ.4.05 కోట్లతో బంధంపల్లి నుంచి హుస్నాబాద్ వరకు తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేసినట్లు చెప్పారు. బీరోలు నుంచి మేడేపల్లి వరకు మరో తారు రోడ్డు నిర్మాణానికి రూ.1.87 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు.

ఇంకా రూ.5.50 కోట్లతో ఐనవోలు బ్రిడ్జి, రూ.3.20 కోట్లతో చౌటుపల్లి-బీరోలు స్లాబ్ కల్వర్ట్, రూ.2 కోట్లతో కూసుమంచి-బీరోలు కల్వర్ట్ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. బీరోలు ఎస్సీ కాలనీలో అంతర్గత రోడ్లు, గ్రామ సీసీ రోడ్లు, అంగన్వాడీ భవనం నిర్మాణ పనులు కూడా ప్రారంభించినట్లు చెప్పారు. పెద్ద చెరువు మరమ్మతులకు రూ.2.05 కోట్లు, మంచినీటి సరఫరా మరియు పశువైద్య సేవలకు అదనంగా నిధులు కేటాయించినట్లు వివరించారు.

రాకాసి తండాలో వరద బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మరియు స్థలాలు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు. ప్రజల వద్దకే పరిపాలనను తీసుకెళ్లడం ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు.

# గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రం బాధ్యత: పొన్నం ప్రభాకర్

- కేంద్ర విధానాలపై మంత్రి విమర్శలు
- కిషన్ రెడ్డి, బండి సంజయ్ స్పందించాలని డిమాండ్
- మూసీ ప్రాజెక్టుపై స్పష్టత ఇచ్చిన మంత్రి

**హైదరాబాద్, 13 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** దేశంలో ప్రస్తుతం నెలకొన్న గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు.

దేశంలో ఇంధన కొరత ఏర్పడిన నేపథ్యంలో కేంద్రం తక్షణమే స్పందించి సరఫరాను మెరుగుపరచాలని మంత్రి డిమాండ్ చేశారు. అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం నెలకొన్న పరిస్థితుల్లో కేంద్రం ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఈ సమస్యపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన కోరారు. మూసీ నది అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన దృష్టి ఉందని మంత్రి చెప్పారు. మూసీని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఈ ప్రాజెక్టుపై ఉన్న సందేహాలను ప్రజలకు సమగ్ర ప్రదర్శన ద్వారా నివృత్తి చేస్తామని వెల్లడించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న నిర్వాసితులకు ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు. వారిని ఇబ్బంది పెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్నారు. మహాత్మా గాంధీ మనవడు తుషార్ గాంధీకి మూసీ ప్రాజెక్టుపై తప్పుడు సమాచారం అందిందని, అందువల్లే ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. బీజేపీకి రాష్ట్రంలో ఒక విధానం, దేశంలో మరో విధానం ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ కాలంలో ఆర్టీసీ కార్మికులకు అన్యాయం జరిగిందని, బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని ఆయన అన్నారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని, దీనిపై అనవసర విమర్శలు చేయవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

# మెట్‌పల్లిలో ఆభరణాల షాపులో చోరీ



- కేంద్ర తాళాలు పగులగొట్టి దొంగల దాడి
- కేంద్ర లాకర్ తెరవడంలో విఫలయత్నం
- కేంద్ర 30 గ్రాముల బంగారం అపహరణ

**జగిత్యాల, 13 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** జగిత్యాల జిల్లాలో దొంగలు మరోసారి రెచ్చిపోయారు. మెట్‌పల్లి పట్టణంలో తాళాలు పగులగొట్టి ఓ ఆభరణాల దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. దుకాణంలోకి ప్రవేశించిన దొంగలు లాకర్‌ను తెరవడానికి ప్రయత్నించినప్పటికీ అది సాధ్యపడలేదు. అయితే దుకాణంలో ఉన్న సుమారు 30 గ్రాముల బంగారాన్ని దొంగలు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ఉదయం షాపు తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించిన దుకాణ యజమాని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. దొంగతనంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కాలంలో వరుసగా దొంగతనాలు జరుగుతుండటంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో పోలీసులు గస్తీని పెంచి భద్రత కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత

**హైదరాబాద్, 13 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర (82) కన్నుమూశారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. కొంత కాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకుంటున్నారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుని ఇంటికి వెళ్లిన అనంతరం బాత్రూంలో పడిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తిరిగి నిమ్స్‌కు తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ ఆయన ప్రాణాలను కాపాడలేకపోయారు.

1965 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన హెచ్‌జే దొర శ్రీకాకుళం జిల్లాకు చెందినవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డీజీపీగా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసి విశేష సేవలు అందించారు. ముఖ్యంగా రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదాన్ని అణచివేయడంలో కీలక పాత్ర పోషించి ప్రత్యేక గుర్తింపు పొందారు. జాతీయ స్థాయిలో కూడా పలు కీలక పదవులు నిర్వహించారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గా, సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా సేవలు అందించారు. 1996లో డీజీపీగా ప్రమోషన్ పొందిన ఆయన తన సుదీర్ఘ సేవా కాలంలో పోలీస్ వ్యవస్థ అభివృద్ధికి కృషి చేశారు. తన వృత్తి జీవిత అనుభవాలను 'జర్నీ త్రూ టర్బ్యులెంట్ టైమ్స్' అనే ఆత్మకథలో పొందుపరిచారు. ఆయన మరణం పోలీస్ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

# ఆర్టీసీ సమ్మె నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

2021 వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని ఆర్టీసీ జేఏసీ డిమాండ్ చేసింది. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల రూ.350 కోట్ల నిధులను కోత లేకుండా ఇవ్వాలని కోరింది. అలాగే పెండింగ్‌లో ఉన్న రూ.2,500 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ట్రేడ్ యూనియన్లపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని జేఏసీ నేతలు కోరారు. గుర్తింపు సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని, ఉద్యోగులపై ఉన్న అధిక పని భారాన్ని తగ్గించాలని కూడా డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెకు వెళ్లక తప్పదని ఆర్టీసీ జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

# అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు అధికారులకు సీఎస్ ఆదేశాలు

**హైదరాబాద్, 13 మార్చి (తెలంగాణ ముచ్చట్లు)** : ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీ, శాసన మండలి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. బడ్జెట్ సమావేశాల ఏర్పాట్లు, పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు సమాధానాలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులతో సీఎస్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవ సభ్యులు అడిగిన అన్ని ప్రశ్నలకు రేపటిలోగా సమాధానాలు పంపించాలని అధికారులను ఆదేశించారు.

ప్రత్యేకంగా నీటిపారుదల, వైద్య ఆరోగ్య, మున్సిపల్ పరిపాలన, ఇంధన, రెవెన్యూ వంటి శాఖలకు సంబంధించిన ప్రశ్నలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అందువల్ల సంబంధిత శాఖలు సమగ్ర సమాధానాలు సిద్ధం చేసి వెంటనే పంపాలని సూచించారు. బడ్జెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమవుతాయని సీఎస్ తెలిపారు. సమావేశాల నిర్వహణపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# మెదక్ ప్రభుత్వ దవాఖానలో ఏసీబీ దాడులు

**మెదక్, 13 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** మెదక్ ప్రభుత్వ ఏరియా దవాఖానలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించడం స్థానికంగా కలకలం రేపింది. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో అధికారుల బృందం ఆసుపత్రిలో తనిఖీలు చేపట్టింది. ఆసుపత్రికి సంబంధించిన పలు రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వివిధ పరిపాలనా వ్యవహారాలపై కూడా అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ముఖ్యంగా రికార్డులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలను పరిశీలిస్తూ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. మెడికల్ ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రక్రియలో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ దాడులు నిర్వహించినట్లు సమాచారం. ప్రభుత్వ పథకాల అమలులో లోపాలు ఉన్నాయా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. ఈ తనిఖీలకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా వెల్లడికాలేదు. దర్యాప్తు పూర్తయ్యాక అధికారికంగా వివరాలు వెల్లడించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



# నిరుపేదలకు అండగా 'లైఫ్ లైన్ ఫౌండేషన్': రంజాన్ రేషన్ కిట్ల పంపిణీ




**ఖమ్మం బ్యూరో, మార్చి 13(తెలంగాణ ముచ్చట్లు):** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని నిరుపేద కుటుంబాలకు లైఫ్ లైన్ ఫౌండేషన్ తమ ఉదారతను చాటుకుంది. నగరంలోని 14వ డివిజన్ పరిధిలో ఉన్న గొల్లగూడెం మరియు రాజన్నపేట కాలనీలలో నివసిస్తున్న నిరుపేదలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా లైఫ్ లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ జానీమియా మాట్లాడుతూ, పండుగ వేళ ఏ పేదవాడు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో తమ సంస్థ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యతని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వాలంటీర్లు షేక్ నజీరుద్దీన్, షేక్ గౌస్ మియా, షేక్ నజీర్, షేక్ కన్నం సాహెబ్, షేక్ చిన్న జానీ మియా, షేక్ షరీఫ్, ఇమామ్, మదర్ సాహెబ్, జానిమియా తదితరులు పాల్గొని పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు. తమకు రేషన్ కిట్లు అందజేసినందుకు కాలనీ వాసులు ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలి



- పదో తరగతిలో 500 కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.5000/- నగదు బహుమతి
- వెల్టూర్ సర్పంచ్ అశోక్

**పెద్దమందడి,మార్చి13(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అశోక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు. వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, యువకులు కూడా కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అలాగే ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులకు పైగా సాధించిన ప్రతి విద్యార్థికి రూ. 5000/ రూపాయల నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు.అదే విధంగా పరీక్షలకు అవసరమైన పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు, షార్పనర్లు, స్కేలు, ప్యాడ్లు వంటి స్టేషనరీ సామగ్రిని కూడా విద్యార్థులకు బహుకరించారు. విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి గ్రామ ప్రజాప్రతినిధులు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాణం విష్ణు మాట్లాడుతూ.. కార్యక్రమానికి హాజరై విద్యార్థులను ప్రోత్సహించిన సర్పంచ్ , వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు మరియు యువకులకు పాఠశాల బృందం, విద్యార్థుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రంజాన్ తోఫాలను పంపిణీ చేసిన పరమేశ్వర్ రెడ్డి




- సెవెన్ హిల్స్ కాలనీ అక్సా మసీదులో ముస్లిం
- సోదరులకు రంజాన్ కానుకలు

**ఉప్పల్, మార్చ్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గంలోని సెవెన్ హిల్స్ కాలనీ అక్సా మసీదులో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తోఫాలను అందజేశారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లిం సోదరుల ఆధ్యాత్మికతకు ప్రతీక అని, సమాజంలో సోదర భావం మరియు ఐక్యత పెంపొందేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షులు అఫ్జాల్, అబ్దుల్ సత్తార్, ఖాదర్ బాషా, బాషా, ఖాదర్ వలి, సలీమ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సుంకు శేఖర్ రెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, మంద మురళీకృష్ణ రెడ్డి, అమర్, సత్యం, ప్రేమ్ గౌడ్, ప్రణయ్ యాదవ్, తుమ్మల దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

- విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

**కుషాయిగూడ, మార్చి 13 ( తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడ డివిజన్ నాగార్జున నగర్ కాలనీలోని సాయి సింధు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసుల సతీష్ గౌడ్, కాసుల పోషయ్య గౌడ్ ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి చర్లపల్లి మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, ప్యాడ్లు తదితర పరీక్ష సామాగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, గురువులు మరియు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రోత్సహించారు.కార్యక్రమ నిర్వాహకులు కాసుల సతీష్ గౌడ్ మాట్లాడుతూ తాను మొదటి తరగతి నుండి పదో తరగతి వరకు ఇదే పాఠశాలలో చదువుకున్నానని తెలిపారు. తాను చదివిన పాఠశాల విద్యార్థులకు తన వంతు సహాయం చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, భాను, శివ, శ్రీకాంత్, ప్రవీణ్, సాయి చరణ్ తదితరులు, స్థానిక నాయకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.





# ప్రగతి పథంలో పేదల సంక్షేమం

- అభివృద్ధి పనులకు సమాంతర ప్రాధాన్యం
- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం బ్యూరో, మార్చి 13(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని, సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి తిరుమలాయపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు అందజేశారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండు సంవత్సరాల మూడు నెలల కాలంలోనే కేవలం బీరోలు గ్రామానికి రూ. 29.92 కోట్లు మంజూరు చేయడం గమనార్హం. ఇందులో భాగంగా రూ. 2.59 కోట్లతో బీరోలు నుంచి ఏలువారిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, రూ. 64 లక్షలతో ఎస్సీ కాలనీలో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి భూమి పూజ చేశారు. అలాగే బంధంపల్లిలో రూ. 5.50 కోట్లతో దమ్మాయిగూడెం నుంచి సోలిపురం రోడ్డు మధ్య నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల పనులు, కల్వర్టుల నిర్మాణం, చెరువు మరమ్మత్తులు వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేశామని వివరించారు.

ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం సరఫరా, కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తూ రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాలు సామాన్యుడి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 72 వేల ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు భరోసా కల్పించామని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలతో పేదల చెంతకు చేరుతామని ధీమా వ్యక్తం చేశారు.

ఆకేరు వాగు ముంపునకు గురైన రాకాసి తండా బాధితులను మంత్రి పరామర్శించి, వారికి ఇందిరమ్మ గృహాల మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా ప్యాకెట్లను పంపిణీ చేశారు. అంతకుముందు గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి, ఆలయ ధర్మకర్తలను శాలువాలతో సత్కరించారు.

# ఆశా వర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం అమలు చేయాలి

- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చ పెట్టాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతి



**ఉప్పల్, మార్చి 13 ( తెలంగాణ ముచ్చట్లు):** ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించి వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కే. ఉన్ని కృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చ జరిపి తగిన నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు. పేదలకు వైద్య సేవలు అందిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ కు సరిపడా నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న జనవరి, ఫిబ్రవరి నెలల పారితోషికాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.తెలంగాణలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో మరియు పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని తెలిపారు.కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలందించిన ఆశా కార్యకర్తల సేవలను ప్రపంచ ఆరోగ్య సంస్థ అయిన ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా గుర్తించి గ్లోబల్ లీడర్స్‌గా అవార్డు అందజేసిందని పేర్కొన్నారు. అయితే అనేక సేవలు అందిస్తున్నప్పటికీ ఆశా కార్యకర్తలకు చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నట్లుగా ఫిక్స్డ్ వేతనం ఇప్పటివరకు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రూ.18 వేల కనీస వేతనం అమలు కాలేదని, అలాగే రూ.50 లక్షల బీమా, మృతి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి హామీలు కూడా ఇప్పటివరకు అమలు కాలేదని ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

# కాప్రాలో పేద ముస్లిం కుటుంబాలకు "ఈద్ కా తోఫా" కిట్ల పంపిణీ

- మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి చేతుల మీదుగా పంపిణీ




**కాప్రా, మార్చి 13 ( తెలంగాణ ముచ్చట్లు):** రంజాన్ పండుగ సందర్భంగా కాప్రా డివిజన్‌లో పేద ముస్లిం కుటుంబాలకు "ఈద్ కా తోఫా" కిట్లను పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి డివిజన్ కాంగ్రెస్ నాయకులతో కలిసి కాప్రాలోని "మస్జీద్ ఈఫఖ్రుల్ ఇస్లాం" మసీదులో ముస్లిం సోదర సోదరీమణులకు ఈ కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా స్వర్ణరాజ్ శివమణి మాట్లాడుతూ రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పేద ముస్లిం కుటుంబాలకు "ఈద్ కా తోఫా" కిట్లను పంపిణీ చేస్తోందన్నారు. కాప్రా డివిజన్‌లోని ప్రతి పేద ముస్లిం కుటుంబానికి ఈ కిట్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.మస్జీద్ ఈఫఖ్రుల్ ఇస్లాం మసీద్ ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు మహమ్మద్ ఇలియాజ్, మహమ్మద్ తాహెర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు .ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొబ్బరినూరి నాగశేషు, మేడ్చల్-మల్కాజ్గిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, జిల్లా ఏఎంసి డైరెక్టర్ పూర్ణ యాదవ్, డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు పడమటి మల్లారెడ్డి, పొట్టు బాబురావు, పబ్బతి నరేందర్ గౌడ్, జి సత్యనారాయణ, తన్నీరు శ్రీహరి, టిల్లు యాదవ్, జగదీష్ గౌడ్, మురళీ, తోటకూర శ్రీకాంత్, రిజ్వాన్ ఖాన్, కే రాజు, షాబుద్దీన్, ఏ శ్రీనివాస్, మహమ్మద్ ఆరిఫ్, మహిళా నాయకులు లక్ష్మీ, జ్యోతి, కాప్రా డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్, యూత్ నాయకులు ఇమ్రాన్, తరుణ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గ్యాస్ కొరతపై ఆందోళన అవసరం లేదు ఉత్తమ్ కుమార్ రెడ్డి





- **బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు**
- **జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్**

**మేడ్చల్–మల్కాజ్గిరి, మార్చి 13 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో ఎల్‌పీజీ గ్యాస్ సరఫరాపై వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. గ్యాస్ కొరతపై వస్తున్న వదంతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం డా. బి. ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం లో మంత్రి సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గృహ వినియోగదారులకు అవసరమైనంత ఎల్‌పీజీ సరఫరా చేయడానికి ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోని బాట్లింగ్ ప్లాంట్లలో ఎక్కడా గ్యాస్ కొరత నమోదు కాలేదని స్పష్టం చేశారు. వదంతులను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవద్దని వినియోగదారులకు సూచించారు.అపోహలను ఆసరాగా చేసుకుని గ్యాస్ నిల్వ చేయడం, అక్రమంగా మళ్లించడం లేదా బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి హెచ్చరించారు. ఇప్పటివరకు ఇటువంటి అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా 288 కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు నిబంధనలు పాటించకపోతే మరింత కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లాల అధికారులకు ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లో ప్రతి 25 రోజులకు ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ సరఫరా కొనసాగుతుందని తెలిపారు.

ఇదే సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ యాసంగి ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీలు, నిల్వ స్థలాలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో వరి సాగు పెరిగిన నేపథ్యంలో సాగు నీటిని సమర్థవంతంగా అందించడంతో పాటు వైవిధ్య పంటలను ప్రోత్సహించాలని సూచించారు.అనంతరం మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్యాస్ బాట్లింగ్ ప్లాంట్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 52 డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరుగుతోందని తెలిపారు.

ఎల్‌పీజీ సరఫరాలో ఏవైనా సమస్యలు ఎదురైతే జిల్లా కంట్రోల్ రూమ్ హెల్ప్‌లైన్ నంబర్: 04029700820 ను సంప్రదించాలని అధికారులు సూచించారు. అసత్య ప్రచారాలను నమ్మకుండా ప్రజలు సహకరించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డీఎం సివిల్ సప్లయ్ సుగుణ బాయి, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, జిల్లా హార్టికల్చర్ అధికారి శ్రీధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# గాయపడిన మున్సిపల్ కార్మికురాలిని ప్రభుత్వం ఆదుకోవాలి

- **ఎమ్మార్పీఎస్, మాదిగల ఐక్య నాయకుల డిమాండ్**



**వనపర్తి ,మార్చి13(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి మున్సిపాలిటీకి చెందిన కార్మికురాలు అలివేలు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసి మాదిగ కుల పెద్దలు ఆమెను పరామర్శించారు. స్థానిక నాయకుడు పరంజ్యోతి సమాచారం మేరకు వనపర్తిలోని సుధా నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందుతున్న అలివేలును కలిసి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.మోటార్ బైక్ ఢీకొనడంతో అలివేలు రెండు చేతుల మోచేతి భాగంలో విరిగినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మాదిగ సామాజిక కార్యకర్త గంధం నాగరాజు, ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాట్లాడుతూ గాయపడిన కార్మికురాలికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని, ఆమెకు జీతంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని అధికారులను కోరారు.అలాగే స్థానిక మున్సిపల్ చైర్మన్ మరియు ఎమ్మెల్యే గారు వెంటనే ఆసుపత్రికి వచ్చి కార్మికురాలిని పరామర్శించి, ఆ కుటుంబాన్ని ఆదుకునే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు గంధం పరంజ్యోతి, గంధం నాగరాజు, రాజనగరం రాజేష్, గోపాలపేట నాగరాజు, కొమ్ము యేసోపు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి

- **లింగాల కమలరాజు**
- **కొనుగోలు కేంద్రాలు లేక దళారీల పాలవుతున్న మొక్కజొన్న రైతులు**
- **కేసీఆర్ పాలనలో కరోనా సమయంలోనూ రైతులకు అండగా నిలిచాం**



**ఖమ్మం బ్యూరో, మార్చి 13(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించడంలోనూ, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలోనూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఖమ్మం మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమలరాజు విమర్శించారు. శుక్రవారం చింతకాని మండలంలోని నాగులవంచ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు వంకాయలపాటి సత్యనారాయణ నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చింతకాని మరియు బోనకల్లు మండలాలు రాష్ట్రంలోనే అత్యధికంగా మొక్కజొన్న పండించే ప్రాంతాలని తెలిపారు. అయితే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొక్కజొన్నకు రూ. 2,400 మద్దతు ధర ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు రూ. 1,600కే కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. మొక్కజొన్న రైతులను ఆదుకోవాలంటే వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గతంలో కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎలాంటి ఆపదలేని పరిస్థితుల్లో కూడా ప్రభుత్వానికి 'రాజకీయ కరోనా' సోకినట్లుగా రైతులను గాలికొదిలేశారని ఎద్దేవా చేశారు.

ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో జిల్లా మంత్రులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గతంలో పంట నష్టం జరిగితే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా పొలాల్లోకి వెళ్లి రైతులకు భరోసా ఇచ్చి, నిబంధనలకు అతీతంగా పరిహారం అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఊరూరా తిరిగి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతు భరోసా కింద రూ. 15 వేల సహాయం ఇస్తామని చెప్పి నేడు మాట తప్పుతున్నారని విమర్శించారు. అలాగే వృద్ధులకు రూ. 4 వేల పెన్షన్, వికలాంగులకు రూ. 6 వేల పెన్షన్ ఇస్తామని ప్రకటించిన హామీలు కూడా అమలు కావడం లేదని అన్నారు. రైతు బీమా అందక రైతుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మేము కొత్తగా ఏమీ అడగడం లేదని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే కోరుతున్నామని తెలిపారు. యూరియా కోసం లైన్లలో నిలబడి, కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి రైతులకు రావడం దురదృష్టకరమని అన్నారు. ఈ సమావేశంలో మంకెన రమేష్, కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, మాజీ ఎంపీపీ పొనుగోటి రత్నాకర్, మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, గడ్డం శ్రీనివాస్, వేముల నర్సయ్య, అప్పారావు, బండి రామారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# వేసవిలో ఆర్టీసీ ప్రయాణికులకు చల్లని కబురు

- **సత్తుపల్లి–హైదరాబాద్ మార్గంలో 6 ఏసీ, 17 సూపర్ లగ్జరీ బస్సులు.**
- **సమయపాలన వివరాలు వెల్లడించిన డిపో మేనేజర్.**
- **గురిజాల లక్ష్మీనారాయణ.**

**సత్తుపల్లి, మార్చి 13 (తెలంగాణ ముచ్చట్లు):** వేసవి కాలంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సత్తుపల్లి డిపో నుంచి హైదరాబాద్‌కు అదనపు బస్సులను నడుపుతున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు. సత్తుపల్లి నుండి హైదరాబాద్‌కు, అలాగే హైదరాబాద్ నుండి సత్తుపల్లికి ప్రతిరోజు 6 ఏసీ బస్సులు, 17 సూపర్ లగ్జరీ బస్సులు నడుస్తున్నాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ సేవలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

సత్తుపల్లి నుండి హైదరాబాద్ ఏసీ బస్సుల సమయాలు:

(బీహెచ్ఈఎల్) కు ఉదయం 7.45, 9.15, 10.00 గంటలకు, రాత్రి 9.00, 9.45, 10.30 గంటలకు ఏసీ బస్సులు బయలుదేరుతాయి. బీహెచ్ఈఎల్ నుండి సత్తుపల్లికి ఉదయం 8.00, 9.00, 10.00 గంటలకు, రాత్రి 9.00, 10.00, 11.00 గంటలకు బస్సులు నడుస్తాయి.

సత్తుపల్లి నుండి హైదరాబాద్ సూపర్ లగ్జరీ బస్సులు

ఉదయం 3.40 (ఎంజీబీఎస్), 5.10 (ఎంజీబీఎస్), 6.00 (బీహెచ్ఈఎల్), 7.30 (ఎంజీబీఎస్), 8.20 (బీహెచ్ఈఎల్), 8.45 (జీడిమెట్ల), 9.40 (ఈసీఐఎల్), 10.45 (ఎంజీబీఎస్) గంటలకు బయలుదేరుతాయి. మధ్యాహ్నం 12.30, 2.00, 3.30 గంటలకు ఎంజీబీఎస్‌కు బస్సులు ఉంటాయి. సాయంత్రం 4.00 గంటలకు ఎంజీబీఎస్‌కు బస్సు నడుస్తుంది. రాత్రి 9.00 (ఈసీఐఎల్), 9.30 (బీహెచ్ఈఎల్), 10.00 (బీహెచ్ఈఎల్), 10.15 (జీడిమెట్ల), 10.40 (గచ్చిబౌలి), 11.15 (లహరి స్లీపర్) కు బస్సులు ఉన్నాయి.

హైదరాబాద్ నుండి సత్తుపల్లి సూపర్ లగ్జరీ బస్సులు

ఉదయం 4.40, 5.50 గంటలకు ఎంజీబీఎస్ నుండి, 6.20 గంటలకు బీహెచ్ఈఎల్ నుండి, 7.00 గంటలకు ఎంజీబీఎస్ మరియు బీహెచ్ఈఎల్ నుండి, 7.15 గంటలకు జీడిమెట్ల నుండి, 9.00 గంటలకు ఈసీఐఎల్ నుండి, 11.15 గంటలకు బీహెచ్ఈఎల్ నుండి బస్సులు నడుస్తాయి. మధ్యాహ్నం 2.20 గంటలకు ఎంజీబీఎస్ నుండి బస్సు బయలుదేరుతుంది. సాయంత్రం 4.15, 6.00 గంటలకు ఎంజీబీఎస్ నుండి బస్సులు ఉంటాయి. రాత్రి 8.40 గంటలకు గచ్చిబౌలి నుండి, 8.45 గంటలకు ఎంజీబీఎస్ నుండి, 9.00 గంటలకు ఈసీఐఎల్ నుండి, 9.20 గంటలకు జీడిమెట్ల నుండి, 9.20 గంటలకు లహరి స్లీపర్ బీహెచ్ఈఎల్ నుండి, 9.40 గంటలకు బీహెచ్ఈఎల్ నుండి బస్సులు నడుస్తాయి.

అదేవిధంగా సత్తుపల్లి నుండి తిరుపతికి మధ్యాహ్నం 3 గంటలకు, అలాగే తిరుపతి నుండి సత్తుపల్లికి మధ్యాహ్నం 3 గంటలకు సూపర్ లగ్జరీ బస్సులు నడుస్తాయని డిపో మేనేజర్ తెలిపారు. సత్తుపల్లి డిపో పరిధిలోని ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని గురిజాల లక్ష్మీనారాయణ కోరారు.

# ఆర్డబ్ల్యూఎస్ ఏఈని సస్పెండ్ చేయాలి – పైడిపల్లి పృథ్విరాజ్ గౌడ్ డిమాండ్



**భీమదేవరపల్లి, మార్చి 13 (తెలంగాణ ముచ్చట్లు):** భీమదేవరపల్లి మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గ్రామీణ నీటి సరఫరా శాఖ (ఆర్డబ్ల్యూఎస్) అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపల్లి పృథ్విరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలో తాగునీటి సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నప్పటికీ సంబంధిత అధికారి స్పందించకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో బోర్‌వెల్లు పనిచేయకపోవడం, పైప్‌లైన్లు దెబ్బతినడం, నీటి సరఫరా సక్రమంగా లేకపోవడం వంటి సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఆర్డబ్ల్యూఎస్ శాఖ నుంచి ఎలాంటి చర్యలు కనిపించడం లేదని విమర్శించారు.

మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి పలుమార్లు వెళ్లినా ఏఈ సతీష్ అందుబాటులో లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమస్యలు వివరించడానికి వెళ్లినా స్పందన లేకపోవడం వల్ల సమస్యలు మరింత పెరుగుతున్నాయని చెప్పారు. అధికారులతో సత్సంబంధాలు ఉన్నాయనే కారణంతోనే ఏఈ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏఈ సతీష్‌ను సస్పెండ్ చేసి, మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పైడిపల్లి పృథ్విరాజ్ గౌడ్ కోరారు. గ్రామాల్లో బోర్లు, పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టి ప్రజలకు నిరంతర నీటి సరఫరా కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

# గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానం

◆ టీజీఎస్ఆర్టీసీ ఖమ్మం రీజియన్



**ఖమ్మం బ్యూరో, మార్చి 13(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఖమ్మం రీజియన్‌లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బి.కాం, బి.ఎస్‌సి, బి.బి.ఎ, బి.సి.ఎ, బి.ఏ మరియు ఇంజనీరింగ్/ డిప్లమా వంటి డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అప్రెంటిస్‌షిప్‌కు అర్హులని పేర్కొన్నారు. ముఖ్యంగా 2021 సంవత్సరం తర్వాత డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు కేంద్ర ప్రభుత్వ నాట్స్ 2.0 పోర్టల్ (https://nats.education.gov.in/) ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియ మార్చి 14, 2026 నుండి మార్చి 23, 2026 వరకు కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు టీజీఎస్ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపోలు మరియు వర్క్‌షాపుల్లో అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అప్రెంటిస్‌షిప్‌కు సంబంధించిన పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని టీజీఎస్ఆర్టీసీ ఖమ్మం రీజియన్ మేనేజర్ సరిరామ్ తెలిపారు.

# పదో తరగతి విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలి

◆ శంకర్ గౌడ్ వనపర్తి జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు



**వనపర్తి,మార్చి13(తెలంగాణ ముచ్చట్లు):** రేపటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో వనపర్తి జిల్లా విద్యార్థిని, విద్యార్థులకు సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షల్లో విద్యార్థులు విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. కష్టపడి చదివిన విషయాలను ప్రశాంతంగా, ఆసక్తితో రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు.సమయపాలన పాటిస్తూ ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.అలాగే ప్రశ్నపత్రంలో సులభమైన ప్రశ్నలకు ముందుగా సమాధానాలు రాయాలని తెలిపారు. హాల్ టికెట్ నంబర్ మరియు ప్రశ్న నంబర్లను సరిగా రాసి ఒకటికి రెండు సార్లు పరిశీలించుకోవాలని సూచించారు. ముఖ్యమైన అంశాలను అండర్‌లైన్ చేస్తూ, సంక్షిప్తంగా సమాధానాలు రాయాలని తెలిపారు.గైడ్లపై ఆధారపడకుండా స్వయంగా అర్థం చేసుకున్న విషయాలను రాయడానికి ప్రయత్నించాలన్నారు. ఏ ప్రశ్నను వదలకుండా జాగ్రత్తగా సమాధానాలు రాయాలని, పదో తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వంటివని పేర్కొన్నారు.విద్యార్థులు పరీక్షలను బాగా రాసి తమ తల్లిదండ్రులు, పాఠశాలలు మరియు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# అమ్మపల్లి శ్రీనివాస్ రెడ్డి ఇకలేరు... బీఆర్ఎస్‌కు తీరని లోటు



◆ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**పెద్దమందడి,మార్చి13(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు అమ్మపల్లి శ్రీనివాస్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడం పట్ల మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న శ్రీనివాస్ రెడ్డి హఠాన్మరణం చెందడం బాధాకరమని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండే నాయకుడిగా శ్రీనివాస్ రెడ్డి గుర్తింపు పొందారని, గ్రామాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. అనేక సందర్భాల్లో తనకు అండగా నిలిచి సహకరించిన వ్యక్తిగా ఆయనను గుర్తు చేసుకున్నారు.నాయకుడిగా మాత్రమే కాకుండా తమ్ముడిలా కీలక సమయాల్లో తోడుగా నిలిచిన వ్యక్తిని కోల్పోవడం వ్యక్తిగతంగా తీరని లోటని నిరంజన్ రెడ్డి భావోద్వేగంగా తెలిపారు.రైతు పక్షపాతిగా పేరు గాంచిన శ్రీనివాస్ రెడ్డి మరణం అమ్మపల్లి గ్రామానికి మాత్రమే కాకుండా పెద్దమందడి మండలానికి కూడా తీరని నష్టమని అన్నారు.దివంగత శ్రీనివాస్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని ఎదుర్కొనే ధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మాజీ మంత్రి తెలిపారు.

# ఖమ్మం జిల్లాలో రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా దూసుకెళ్తున్న బీసీ సమాజం





◆ జాతీయ బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.వి కృష్ణారావు

**ఖమ్మం బ్యూరో, మార్చి 13(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం నగరంలో శుక్రవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తిని మధు గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.వి కృష్ణారావు హాజరై మాట్లాడారు . సమాజంలో బీసీలు అనగా దొక్కబడుతున్నారని ఇప్పటికైనా మేల్కొని బీసీలు అంతా ఐక్యమై రాజ్యాధికార దిశగా ప్రయాణించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లేషన్ సభలో ఇచ్చిన హామీ అయిన బీసీ 42% రిజర్వేషన్ ను వెంటనే అమలు చేసి షెడ్యూల్ నైన్ (9) లో పొందుపరిచి చట్టబద్రత కల్పించాలని అలాగే బీసీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ ను ఏర్పాటు చేసి సామాజిక , ఆర్థిక , రాజకీయ , విద్య , వైద్య మరియు ఉద్యోగ రంగాలలో బీసీ అభివృద్ధికి ప్రభుత్వాలు తోడ్పడి బీసీ బిడ్డలకు ముందు తరాల భవిష్యత్తును అందించాలని కోరారు . అలాగే మార్చ్ 15న జరిగే ఫీజు పోరు దీక్ష ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు . సత్తుపల్లి నియోజకవర్గం అధ్యక్షులు మారుతి ఆధ్వర్యంలో 5 మండలాల అధ్యక్షులు నియమించడం జరిగింది . ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మోత్కూరు వెంకటేశ్వర చారి , రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు యాదవ్ , జిల్లా గౌరవ సలహాదారులు పద్మాచారి , జిల్లా ఉపాధ్యక్షులు మక్కల వెంకన్న , యువజన విభాగం జిల్లా అధ్యక్షులు రాసాల సతీష్ యాదవ్ , ప్రధాన కార్యదర్శి చిన్నం శెట్టి వెంకట రామకృష్ణ , కోశాధికారి గునిగంటి వీరన్న , జిల్లా కార్యదర్శి కుందారపు సుధాకర్ , ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పుల్లూరు వెంకన్న బాబు , సత్తుపల్లి కాంసెన్సీ స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షులు సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు . కొండలరావు సత్తుపల్లి మండలం , మణికంఠ వేంసూరు మండలం , శీను పెనుబల్లి మండలం , మురళి కల్లూరు మండలం , శ్రీనివాసరావు తల్లాడ మండలం వారిగా ఎన్నుకున్నారు .

# మనిగిల్ల ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం

**పెద్దమందడి,మార్చి13(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని మనిగిల్ల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాఠశాల నిర్వహణలో వివిధ బాధ్యతలను చేపట్టి తమ ప్రతిభను ప్రదర్శించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బి. శివ ప్రసాద్, జిల్లా కలెక్టర్‌గా డి. వైష్ణవి, జిల్లా విద్యాధికారిగా జి. కిరణ్ కుమార్, మండల విద్యాధికారిణిగా కె. నిత్య బాధ్యతలు నిర్వహించారు.



కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల విద్యాధికారిణి మంజులత, గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నస్రీన్ బేగం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల అనుభవాలను పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.!







◆ దమ్మపేటలో ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ.

**దమ్మపేట, మార్చి 13 (తెలంగాణ ముచ్చట్లు):** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సోదర సోదరీమణులకు అందజేస్తున్న రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం దమ్మపేట మండల కేంద్రంలోని ఎంఆర్‌ఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లిం సమాజానికి అత్యంత పవిత్రమైనదని పేర్కొన్నారు. ఈ నెలలో ఉపవాసాలు పాటిస్తూ ప్రార్థనలు చేయడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు పరస్పర సహకారం, సోదరభావం పెంపొందుతాయని తెలిపారు. పేద మరియు మధ్యతరగతి ముస్లిం కుటుంబాలు ఆనందంగా రంజాన్ పండుగను జరుపుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రంజాన్ తోఫాను అందజేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి, ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, మందలపల్లి గుజ్జుల శ్రీనివాసరావు, ఎమ్మార్వో రామ్ నరేష్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, చిన్నశెట్టి యుగంధర్, పర్వతనేని ప్రసాద్, అత్తులూరి వెంకట్రావు, పగడాల రాంబాబు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఎస్ సి పరీక్షల నేపథ్యంలో మల్కాజిగిరి కమిషనరేట్‌లో 144 సెక్షన్ అమలు

◆ పరీక్షా కేంద్రాల వద్ద గుమిగూడడంపై నిషేధం
◆ జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్ల మూసివేతకు ఆదేశాలు

**మల్కాజిగిరి, మార్చి 13 (తెలంగాణ ముచ్చట్లు):** పదవ తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు కమిషనర్ అవినాష్ మహంతి భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 (గతంలో 144 సెక్షన్) కింద నిషేధాజ్ఞలు జారీ చేశారు.ఈ ఆదేశాల ప్రకారం పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 200 మీటర్ల పరిధిలో నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడడాన్ని పూర్తిగా నిషేధించారు. ఈ ఆంక్షలు మార్చి 14 ఉదయం 6 గంటల నుంచి ఏప్రిల్ 16 సాయంత్రం 6 గంటల వరకు అమల్లో ఉంటాయని పోలీసులు తెలిపారు. అయితే విధుల్లో ఉన్న పోలీసులు, మిలిటరీ సిబ్బంది, హోమ్ గార్డులు, విద్యాశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు మరియు అంత్యక్రియల ఊరేగింపులకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇవ్వబడింది.

పరీక్షల్లో అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు పరీక్షా కేంద్రాల సమీపంలోని 100 మీటర్ల పరిధిలో ఉన్న ఫోటోకాపీ (జిరాక్స్) మరియు ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలని కమిషనర్ ఆదేశించారు. పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కేంద్రాలు మూసి ఉంచాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి పరీక్షా కేంద్రాల వద్ద గుమిగూడడం లేదా అనుమతి లేకుండా జిరాక్స్ సెంటర్లు తెరవడం వంటి చర్యలు చేపట్టినట్లయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ప్రజలందరూ సహకరించాలని పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## విట్ట శ్రీనివాస్ రెడ్డి మృతి.. నల్ల బ్యాడ్జీలతో అఖిలపక్ష నాయకుల సంఘీభావం



**పెద్దమందడి,మార్చి13(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మదిగట్ల గ్రామంలో మాజీ మండల పీఏసీఎస్ చైర్మన్ విట్ట శ్రీనివాస్ రెడ్డి మృతి పట్ల అఖిలపక్ష నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విట్ట శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా పేరు పొందారని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు.ఆయన మరణం మండలానికి తీరని లోటని అభిప్రాయపడ్డారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు పలువురు స్థానికులు పాల్గొని తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.

## పాఠశాల కాంపౌండ్ వాల్‌పై తిమ్మాపూర్‌లో వివాదం



**ఎల్కతుర్తి, మార్చి 13:( తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల వద్ద చేపడుతున్న కాంపౌండ్ వాల్ నిర్మాణం వివాదానికి దారితీసింది. గ్రామ ప్రజలకు మరియు వార్డు సభ్యులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ముప్పు మానస మహేందర్ ఈ నిర్మాణ పనులు ప్రారంభించారని గ్రామస్థులు ఆరోపించారు.

ఈ కాంపౌండ్ వాల్ నిర్మాణం జరిగితే పక్కనే ఉన్న ఇండ్లకు మరియు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఉన్న రాకపోక మార్గం మూసుకుపోయే ప్రమాదం ఉందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు కలగవచ్చని వారు తెలిపారు.

ఈ నేపథ్యంలో తిమ్మాపూర్ గ్రామ ప్రజలు మరియు వార్డు సభ్యులు కలిసి శుక్రవారం ఎల్కతుర్తి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ ప్రసాద్ రావుకు వినతిపత్రం సమర్పించారు. కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి, హద్దులు స్పష్టంగా నిర్ణయించి గ్రామ ప్రజలు తమ ఇండ్లకు మరియు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు సరైన మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొలుగూరు రమేష్ బాబు, దామెర తరుణ్, చంద్రగిరి కుమారస్వామి, చంద్రగిరి ప్రశాంత్, గాజుల హరీష్, బండి రాజకుమార్, చిప్ప రామచందర్, గొల్ల రాకేష్, చంద్రగిరి అఖిల్, రాజయ్య, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమందడిలో న్యాయ సేవలు, వినియోగదారుల హక్కులపై అవగాహన




**పెద్దమందడి,మార్చి13(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని రైతు వేదికలో న్యాయ సేవలు మరియు వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయమూర్తి రజిని అధ్యక్షత వహించి ప్రజలకు న్యాయ సేవల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, న్యాయ సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా వినియోగదారుల హక్కుల గురించి ప్రజలకు వివరించి, సమస్యలు ఎదురైనప్పుడు న్యాయ సహాయం పొందే విధానాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో పెద్దమందడి తహసీల్దార్ పాండు నాయక్ పాల్గొని మాట్లాడుతూ ప్రజలు న్యాయ సేవలు, వినియోగదారుల హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు.సమస్యలు ఎదురైనప్పుడు చట్టపరమైన మార్గాలను ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, న్యాయవాది కృష్ణయ్య, జిల్లా న్యాయ సేవల సంస్థ సభ్యుడు అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న వారు న్యాయ సేవలపై అవగాహన పెంపొందించుకోవడం అవసరమని అభిప్రాయపడ్డారు.







## 1 ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధన భేష్

**ఖమ్మం బ్యూరో, మార్చి 13(తెలంగాణ ముచ్చట్లు):**కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మండల పరిషత్ పాఠశాలలు ఆంగ్ల బోధనలో ముందున్నాయని,తల్లంపాడు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని సర్పంచ్ అంబేద్కర్ అన్నారు. శనివారం ఖమ్మం రూరల్ పరిధి లోని ప్రభుత్వ పాఠశాల తల్లంపాడు లో జరిగిన స్కూల్ డే కమ్ ఫేర్వెల్ పార్టీ వేడుక సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. విద్యార్థుల ఆంగ్ల ఉపన్యాసం అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారు.పాఠశాలకు కావలసిన సదుపాయాలను కల్పించే ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. పూర్వ ఉపాధ్యాయులు పీవీ రమణ పంపిణీచేసిన పరీక్ష ప్యాడ్ లను పెన్నులు విద్యార్థులకు అందించారు.సభకు అధ్యక్షత వహించిన పాఠశాల హెచ్ ఎం హైమావతి మాట్లాడుతూ ఎపీ చైల్డ్ రీడింగ్ ను విజయవంతంగా నిర్వహిస్తున్నామని.. పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహం అభినందనీయమని అన్నారు. ఉపాధ్యాయులు, కవి, కటుకోర్ఝ్వుల రమేష్ సభా సమన్వయం చేశారు. సభ ప్రారంభానికి ముందు విద్యార్థిని విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగలక్ష్మి,రాకేష్, విశ్రాంత ఉపాధ్యాయులు పీవీ రమణ,వార్డు కౌన్సిలర్లు అశోక్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం అమలు చేయాలి

- **ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన ఆశా వర్కర్స్ యూనియన్**



**మల్కాజిగిరి, మార్చి 13 (తెలంగాణ ముచ్చట్లు):** ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించి వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మల్కాజిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కే. ఉన్నికృష్ణ, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి, జిల్లా ఉపాధ్యక్షురాలు కే. కోమలత మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం అమలు చేయాలని తెలిపారు. ఈ అంశాన్ని ప్రస్తుత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే చర్చించి నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కు సరిపడా నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న జనవరి, ఫిబ్రవరి నెలల పారితోషికాలను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాలుగా పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని తెలిపారు.కరోనా సమయంలో ఆశా కార్యకర్తలు ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలందించారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తిస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) గ్లోబల్ లీడర్స్ అవార్డును కూడా అందజేసిందని గుర్తు చేశారు.అనేక సేవలు అందిస్తున్నప్పటికీ ఆశా కార్యకర్తలకు చట్టబద్ధమైన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా ఫిక్స్డ్ వేతనం ఇప్పటివరకు తెలంగాణలో అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆశా వర్కర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారం కోసం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

## పదో తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన పోలీసు భద్రత

- **వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి**

**వనపర్తి,మార్చి13(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలో నిర్వహించనున్న పదో తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా పోలీసు అధికారి సునిత రెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలు కాపాడేందుకు బీఎన్ఎస్ఎస్-2023 చట్టం ప్రకారం 163 నిబంధన అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 37 పరీక్షా కేంద్రాలలో 7,212 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడటాన్ని నిషేధించారు. ఈ ఆంక్షలు మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. ప్రతి పరీక్షా రోజు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయి.పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న నకలు పత్రాల ప్రతులు తీసే కేంద్రాలను పరీక్షల సమయంలో మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని అన్ని పోలీసు కేంద్రాల అధికారులకు పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు చేతి గడియారాలు లేదా ఇతర విద్యుత్ పరికరాలను పరీక్షా కేంద్రాలకు తీసుకురావద్దని సూచించారు. పరీక్షల సమయంలో పర్యవేక్షకులు మరియు పోలీసు సిబ్బంది చేతి దూరవాణి వినియోగాన్ని కూడా నిషేధించారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.విద్యార్థులు ఎటువంటి భయం లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయేందుకు పోలీసు శాఖ పూర్తి భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ప్రజలు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.



## శీనన్న మృతి.. మండలానికి తీరని లోటు

- **అమ్మపల్లెలో విషాదం – గ్రామ ప్రజల కన్నీటి వీడ్కోలు**

**పెద్దమందడి,మార్చి13(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండల అమ్మపల్లె గ్రామానికి చెందిన విట్టా లక్ష్మారెడ్డి-విమలమ్మ దంపతుల పెద్ద కుమారుడు శ్రీనివాసరెడ్డి (శీనన్న) మృతి మండల వ్యాప్తంగా విషాదాన్ని నింపింది. గత వారం రోజులుగా మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఆయన తుది శ్వాస విడిచారు.ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే గ్రామ ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.అమ్మపల్లె గ్రామంలో జన్మించిన శ్రీనివాస రెడ్డి ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండే వ్యక్తిగా పేరు సంపాదించారు.ఎవరికైనా ఆపద వచ్చినప్పుడు ముందుండి సహాయం చేసే స్వభావం ఆయనది. గ్రామ ప్రజల సమస్యలను అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన ఎప్పుడూ చురుకుగా వ్యవహరించేవారు.తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు చైర్మన్ డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి తదితర నాయకులతో ఆయనకు సన్నిహిత అనుబంధం ఉండేది. గ్రామ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు విశేషమైనవి.అమ్మపల్లె గ్రామంలో తొలి సర్పంచ్‌గా, మద్దిగట్ల గ్రామంలో సర్పంచ్‌గా, పెద్దమందడి మండల సహకార సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. రాజకీయంగా కాంగ్రెస్ పార్టీలో కీలక కార్యకర్తగా, తెలుగుదేశం పార్టీలో రెండు పర్యాయాలు మండల అధ్యక్షుడిగా, టీఆర్ఎస్ పార్టీలో ముఖ్య నేతగా కొనసాగుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.చిన్నా పెద్ద తేడా లేకుండా అందరితో ఆప్యాయంగా మాట్లాడే స్వభావం కలిగిన శీనన్న మృతి పట్ల మద్దిగట్ల, మోజర్ల, గట్ల ఖానాపూర్ గ్రామాల ప్రజలు కూడా తీవ్ర దుఃఖం వ్యక్తం చేశారు.ఆయన లేని లోటును ఎవరు తీర్చలేరని గ్రామ ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు.ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.







# మార్చి నెలాఖరుకు లక్ష ఇందిరమ్మ ఇళ్లు పూర్తి

- **కామేపల్లి మండలంలో రూ. 12.48 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన**

**ఖమ్మం బ్యూరో, మార్చి 13(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని నిరుపేదలందరికీ సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కామేపల్లి మండలంలో స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి పర్యటించిన ఆయన సుమారు 12.48 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు.

**అభివృద్ధి పనుల హోరు**

మండల వ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మంత్రి పలు బీటీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. జాస్తిపల్లి నుంచి కెప్టెన్ బంజర వరకు రూ. 3.15 కోట్లతో చేపట్టే పనులతో పాటు, లాల్యతండ నుంచి జగన్నాథ తండ వరకు రూ. 3.33 కోట్లు, ఊటుకూరులో ముత్యాలంపాడు గుడి నుంచి శ్మశాన వాటిక వరకు రూ. 1.80 కోట్లు, తాళ్ళగూడెం పరిధిలో టేకుల తండ, పింజరిమడుగు మీదుగా డోర్నకల్ రోడ్డు వరకు రూ. 4.20 కోట్లతో నిర్మించనున్న రహదారులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు మంత్రికి ఘనస్వాగతం పలికారు.

**గత ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజం**

ముచ్చర్ల, పింజరమడుగు గ్రామాల్లో గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించిన అనంతరం మంత్రి సభలో మాట్లాడారు. గత పాలకుల పదేళ్ల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్లు కూడా నిర్మించలేకపోయారని ఆయన విమర్శించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో పేదలను ఊరించి మోసం చేశారని మండిపడ్డారు. వైఎస్సార్ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను అవహేళన చేసిన వారు, తాము అధికారంలో ఉండి కనీసం ఇళ్లు పూర్తి చేయలేకపోయారని ధ్వజమెత్తారు.

**ఏప్రిల్‌లో రెండో విడత**

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి పొంగులేటి తెలిపారు. యుద్ధప్రాతిపదికన పనులు సాగుతున్నాయని, మార్చి చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్లను పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేస్తామని ప్రకటించారు. వచ్చే ఏప్రిల్ నెలలో మరో విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని, అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు ఇచ్చి తీరుతామని భరోసా ఇచ్చారు.

**సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష**

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి వివరించారు. ముఖ్యంగా పేదింటి మహిళల కష్టాలను గుర్తించి సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఊటుకూరులో జరుగుతున్న అభివృద్ధి పనులను వర్షాకాలం లోపే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడంతో పాటు, స్థానిక ఎమ్మెల్యే కోరిన మరిన్ని రహదారి పనులను ఏప్రిల్‌లో మంజూరు చేస్తానని సభాముఖంగా హామీ ఇచ్చారు.

## ఎస్‌సి యాక్షన్ ప్లాన్ 2025–26 కింద
# స్వయం ఉపాధి పథకాలు

- **ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ యూనిట్లకు భారీ సబ్సిడీ**
- **దరఖాస్తులకు ఆహ్వానం**

**మేడ్చల్–మల్కాజిగిరి, మార్చి 13 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్/చైర్మన్ ఆదేశాల మేరకు షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి వారి ఆర్థిక పురోగతిని పెంపొందించేందుకు "ఎస్‌సి యాక్షన్ ప్లాన్ 2025-26" కింద పలు పథకాలను అమలు చేయనున్నట్లు జిల్లా ఎస్‌సి కార్పొరేషన్ అధికారులు తెలిపారు.ఈ పథకం కింద రూ.1 లక్ష వరకు విలువ గల ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలకు 90 శాతం సబ్సిడీ, రూ.3 లక్షల విలువ గల ఎలక్ట్రికల్ త్రిచక్ర ఆటోలు (ప్యాసింజర్/గూడ్స్)కు 70 శాతం సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. అలాగే రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు విలువ గల సోలార్ యూనివర్సల్ పంప్ కమ్ టూల్ మరియు వ్యవసాయ అనుబంధ యూనిట్లకు రూ.5 లక్షల వరకు 60 శాతం సబ్సిడీతో రుణాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.ఉపాధి పథకాల కోసం 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు కల అభ్యర్థులు, భూసంబంధిత వ్యవసాయ/సోలార్ పరికరాల పథకాల కోసం 21 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ/మున్సిపల్ ప్రాంతాలకు రూ.2 లక్షలు మించకూడదని పేర్కొన్నారు.

అభ్యర్థులు కుల ధృవపత్రం, ఒక సంవత్సరంలోపు ఆదాయ ధృవపత్రం, ఆధార్ కార్డు, ఫుడ్ సెక్యూరిటీ కార్డు (ఎఫ్‌ఎస్‌సి), డ్రైవింగ్ లైసెన్స్ వంటి పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. దారిద్ర రేఖకు దిగువన (బిపిఎల్) ఉన్నవారే అర్హులని తెలిపారు.అర్హత మరియు ఆసక్తి కలిగిన అభ్యర్థులు మార్చి 17 నుంచి మార్చి 24, 2026 వరకు టీజీఓబీఎంఎంఎస్ ఆన్లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయం, సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం (ఐడిఓసి), మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ ను లేదా 04024020610 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

# ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై అభిశంసన నోటీసు

- **లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్షాల చర్య**
- **130 మంది లోక్‌సభ ఎంపీలు, 63 మంది రాజ్యసభ సభ్యుల సంతకాలు**
- **ఓటర్ల జాబితా అంశంపై ఆరోపణలు**

**న్యూఢిల్లీ, 13 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కోరుతూ ప్రతిపక్షాలు పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో అభిశంసన తీర్మాన నోటీసులు సమర్పించాయి. శుక్రవారం లోక్‌సభ మరియు రాజ్యసభ కార్యాలయాలకు ఈ నోటీసులు అందజేసినట్లు పార్లమెంట్ వర్గాలు వెల్లడించాయి. దేశ ఎన్నికల వ్యవస్థపై ఈ చర్య రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. సమాచారం ప్రకారం లోక్‌సభకు సమర్పించిన నోటీసుపై 130 మంది ఎంపీలు సంతకాలు చేశారు. అలాగే రాజ్యసభలో సమర్పించిన నోటీసుపై 63 మంది సభ్యులు మద్దతు తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియలో కేంద్రంలోని అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కాపాడాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ ప్రస్తుత పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని విపక్ష నేతలు పేర్కొన్నారు. అయితే ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై పార్లమెంట్‌లో అభిశంసన నోటీసు ఇవ్వడం ఇదే మొదటిసారి కావడం విశేషంగా మారింది. ఈ అంశంపై పార్లమెంట్‌లో తదుపరి ప్రక్రియ ఎలా సాగుతుందన్నదానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలపై మోదీ ఆందోళన


- **ఇరాన్ అధ్యక్షుడితో ఫోన్‌లో చర్చ**
- **భారతీయుల భద్రతే ప్రథమ ప్రాధాన్యత**
- **ఎల్పీజీ కొరతపై వదంతులను ఖండించిన ప్రధాని**



**న్యూఢిల్లీ, 13 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్త పరిస్థితులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడిన మోదీ, ప్రాంతీయ భద్రత మరియు శాంతి స్థాపనపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ విషయాన్ని ప్రధాని సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, పౌరుల ప్రాణనష్టం, మౌలిక సదుపాయాల విధ్వంసం వంటి అంశాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో నివసిస్తున్న భారతీయుల భద్రత, క్షేమమే భారత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని ప్రధాని స్పష్టం చేశారు. సరకు రవాణా, ఇంధన సరఫరా వంటి అంశాలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల ద్వారా రవాణా నిరంతరాయంగా సాగాల్సిన అవసరం ఉందని తెలిపారు. హింసకు ముగింపు పలికి చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రధాని సూచించారు. పశ్చిమాసియా దేశాల్లో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరిలో ఇరాన్‌లో సుమారు తొమ్మిది వేల మంది, ఇజ్రాయెల్‌లో నలభై వేల మందికి పైగా భారతీయులు ఉన్నారు. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్‌లో ఉన్న భారతీయుల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే కొంతమంది విద్యార్థులు భారత రాయబార కార్యాలయం సహాయంతో స్వదేశానికి చేరుకున్నారని విదేశాంగ శాఖ తెలిపింది. మిగతా వారిని కూడా సురక్షితంగా తరలించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ప్రధాని మోదీ దేశంలో ఎల్పీజీ కొరత ఉందంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ పరిస్థితులను అడ్డంగా పెట్టుకుని కొన్ని వస్తువులను అక్రమంగా నిల్వ చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. అలాంటి అక్రమ చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేశ ఇంధన భద్రతను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ప్రధాని తెలిపారు. 2014కి ముందు దేశంలో వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయని, ప్రస్తుతం దేశంలో ఐదు మిలియన్ టన్నులకు పైగా వ్యూహాత్మక చమురు నిల్వలు ఉన్నాయని ఆయన చెప్పారు. గత దశాబ్దంలో దేశ శుద్ధి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత అంతర్జాతీయ సంక్షోభాన్ని కూడా దేశం సమర్థంగా ఎదుర్కొంటుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

# ఇరాక్‌లో కూలిన అమెరికా సైనిక విమానం

- **రీఫ్యూయలింగ్ విమానం ప్రమాదం**
- **శత్రు దాడి లేదని అమెరికా స్పష్టం**
- **ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది**



**బాగ్దాద్, 13 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** ఇరాక్‌లో అమెరికాకు చెందిన సైనిక విమానం గురువారం రాత్రి కూలిన ఘటన కలకలం రేపింది. అమెరికా మిలిటరీకి చెందిన కేసీ135 రీఫ్యూయలింగ్ విమానం ఈ ప్రమాదంలో పడినట్లు అమెరికా అధికారులు ధృవీకరించారు. ఈ ఘటనలో రెండు విమానాలు భాగస్వామ్యమైనట్లు సమాచారం. అయితే ఇది శత్రు దాడి వల్ల గానీ, ఫ్రెండ్లీ ఫైరింగ్ కారణంగా గానీ జరిగిందని ఎలాంటి ఆధారాలు లేవని అధికారులు స్పష్టం చేశారు. పశ్చిమ ఇరాక్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ రక్షణ చర్యలు ప్రారంభించినట్లు తెలిపింది. ఇదే ఘటనలో భాగస్వామ్యమైన మరో విమానం సురక్షితంగా ల్యాండ్ అయినట్లు అధికారులు పేర్కొన్నారు. కేసీ 135 రీఫ్యూయలింగ్ విమానం ఇతర యుద్ధ విమానాలకు గగనతలంలోనే ఇంధనం నింపే ప్రత్యేక విమానం. యుద్ధ సమయంలో దీని పాత్ర అత్యంత కీలకంగా ఉంటుంది. సుదూర ప్రయాణాలు చేసే యుద్ధ విమానాలు, బాంబర్ విమానాలకు ఈ రీఫ్యూయలింగ్ విమానాలు గాల్లోనే ఇంధనం అందిస్తాయి. ఈ విమానం ఎందుకు కూలిందన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. గగనతలంలో మరో విమానంతో ఢీకొనడం వంటి ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం యుద్ధ పరిస్థితుల కారణంగా గగనతలంలో ఎక్కువ సంఖ్యలో యుద్ధ విమానాలు సంచరిస్తున్న నేపథ్యంలో రీఫ్యూయలింగ్ కార్యకలాపాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను త్వరలో వెల్లడించే అవకాశం ఉందని అమెరికా అధికారులు తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# అల్లు అర్జున్ – అట్లీ ప్రాజెక్ట్‌కు షారుక్ ఖాన్ సపోర్ట్?.. గ్లింప్స్ లాంచ్‌పై ఇండస్ట్రీలో చర్చ

భారతీయ సినీ పరిశ్రమలో ప్రస్తుతం అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న ప్రాజెక్టుల్లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం ఒకటి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాను కేవలం పాన్ ఇండియా స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో గ్లోబల్ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని రూపొందిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

ఇప్పటికే జవాన్ చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు అట్లీ, ఈ కొత్త ప్రాజెక్ట్‌ను మరింత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన వార్త ఇప్పుడు సినీ పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది.

ఈ చిత్రానికి సంబంధించిన గ్లింప్స్‌ను బాలీవుడ్ బాద్షా షారుక్ ఖాన్ చేతుల మీదుగా విడుదల చేయాలని చిత్ర బృందం ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఇది నిజమైతే, అది కేవలం ఒక ప్రమోషన్ మాత్రమే కాకుండా గ్లోబల్ మార్కెటింగ్ వ్యూహంగా మారే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అల్లు అర్జున్ ఇప్పటికే పుష్ప సినిమాతో దేశవ్యాప్తంగా విపరీతమైన గుర్తింపు పొందాడు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలు, గల్ఫ్ దేశాల్లో అతనికి భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడింది. మరోవైపు షారుక్ ఖాన్‌కు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఉన్నారు. అందుకే షారుక్ ఖాన్ ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేస్తే, అది ప్రపంచ మీడియా దృష్టిని ఆకర్షించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

షారుక్ ఖాన్ సోషల్ మీడియా ప్రభావం కూడా ఈ సినిమాకు మరింత హైప్ తీసుకురాగలదని సినీ విశ్లేషకులు అంటున్నారు. అమెరికా, యూరప్, గల్ఫ్ దేశాలు వంటి విదేశీ మార్కెట్లలో సినిమా డిస్ట్రిబ్యూషన్ హక్కులకు భారీ డిమాండ్ ఏర్పడే అవకాశముందని భావిస్తున్నారు.

అలాగే బాలీవుడ్ మార్కెట్‌లో కూడా ఈ ప్రాజెక్ట్‌కు మరింత ప్రాచుర్యం లభించే అవకాశం ఉంది. ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ ఓపెనింగ్స్ సాధించడానికి షారుక్ ఖాన్ మద్దతు ఒక బలమైన వేదికగా మారవచ్చని ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇది టాలీవుడ్ – బాలీవుడ్ మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడమే కాకుండా భారతీయ సినిమాను ప్రపంచ స్థాయిలో మరింత బలంగా నిలబెట్టే అవకాశం ఉందని సినీ పరిశ్రమలో చర్చ జరుగుతోంది.

అయితే ఈ వార్తలపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.



# అనుష్క పెళ్లిపై మళ్లీ ఊహాగానాలు.. ఈ ఏడాదే స్వీటీ వివాహం అంటున్న ప్రచారం..!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి పెళ్లి విషయంపై మరోసారి సోషల్ మీడియాలో ఊహాగానాలు మొదలయ్యాయి. తన నటన, వ్యక్తిత్వంతో ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన ఈ స్టార్ హీరోయిన్ గురించి గతంలో కూడా పలుమార్లు వివాహ వార్తలు వినిపించాయి. తాజాగా మరోసారి ఆమె పెళ్లి చేసుకోబోతున్నారంటూ నెట్టింట ప్రచారం జోరుగా సాగుతోంది. అనుష్క శెట్టి తన సినీ ప్రయాణాన్ని 'సూపర్' సినిమాతో ప్రారంభించింది. తక్కువ కాలంలోనే టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగి అనేక మంది ప్రముఖ హీరోల సరసన నటించింది. వరుస విజయాలతో ఆమెకు భారీ క్రేజ్ ఏర్పడింది. ఒక సమయంలో తెలుగు సినిమాల్లో అనుష్క లేకుండా పెద్ద సినిమా ఉండదనే స్థాయికి చేరుకుంది.

తర్వాత కాలంలో అనుష్క కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను మాత్రమే ఎంచుకుంటూ ముందుకు సాగింది. ముఖ్యంగా 'బాహుబలి ది బిగినింగ్', 'బాహుబలి ది కంక్లూజన్' సినిమాల ద్వారా ఆమెకు పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ చిత్రాల విజయంతో దేశవ్యాప్తంగా ఆమెకు అభిమానులు పెరిగారు.

గత కొన్నేళ్లుగా అనుష్క సినిమాల సంఖ్యను తగ్గించింది. సంవత్సరానికి ఒకటి లేదా రెండు సినిమాల్లో మాత్రమే నటిస్తూ కెరీర్‌ను కొనసాగిస్తోంది. ఇదే సమయంలో ఆమె వ్యక్తిగత జీవితంపై కూడా తరచూ పుకార్లు వినిపిస్తున్నాయి. గతంలో అనుష్క ఒక డాక్టర్‌ను పెళ్లి చేసుకోబోతుందనే వార్తలు వినిపించాయి. అలాగే ఒక స్టార్ హీరోతో ఆమె వివాహం జరగబోతుందనే ప్రచారం కూడా జరిగింది. అయితే ఆ వార్తలన్నింటికీ ఎప్పుడూ అధికారిక ధృవీకరణ రాలేదు.

ఇప్పుడు తాజాగా మరోసారి అనుష్క వివాహం గురించి వార్తలు వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఆమె వయసు 44 సంవత్సరాలు కాగా, కుటుంబ సభ్యుల ఒత్తిడి పెరగడంతో పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. కుటుంబానికి దగ్గర బంధువైన ఒక వ్యాపారవేత్తతో ఆమె వివాహం జరగబోతుందనే టాక్ వినిపిస్తోంది.

ఇరు కుటుంబాల మధ్య అంగీకారం కూడా జరిగిందని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల కాలంలో అనుష్క సినిమాలకు కొంత దూరంగా ఉంటూ వ్యక్తిగత జీవితంపై ఎక్కువగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

అయితే ఈ వార్తలపై అనుష్క లేదా ఆమె కుటుంబ సభ్యుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ఈ వార్తలు నిజమా కాదా అన్న విషయంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.



# విడాకుల తర్వాత హన్సిక తొలి పోస్ట్.. కష్టాల్లోనూ పాజిటివ్‌గా ఉండాలని సందేశం

టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకులను తన అందం, నటనతో ఆకట్టుకున్న ప్రముఖ నటి హన్సిక మోత్వాని వ్యక్తిగత జీవితం ఇటీవల సోషల్ మీడియాలో పెద్ద చర్చగా మారింది. వ్యాపారవేత్త సోహైల్ కతూరియాను ప్రేమించి వివాహం చేసుకున్న హన్సిక అతనికి విడాకులు ఇచ్చిందనే వార్తలు కొంతకాలంగా నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో హన్సిక చేసిన తాజా సోషల్ మీడియా పోస్ట్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది.

హన్సిక తన సోషల్ మీడియా ఖాతాలో "చర్ది కాలా ఆల్వేస్" అనే పంజాబీ కోటేషన్‌ను షేర్ చేసింది. ఈ పదానికి అర్థం ఎలాంటి కష్టాలు ఎదురైనా మనసులో ధైర్యం, పాజిటివ్ భావనను కొనసాగించాలి అన్నది. ఈ పోస్ట్ ద్వారా తన జీవితంలో ఎదురైన పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటున్నానని హన్సిక సూచించినట్లు నెటిజన్లు భావిస్తున్నారు.

కొంతకాలంగా హన్సిక, సోహైల్ కతూరియా మధ్య విభేదాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఇటీవల ముంబైలోని బాంద్రా కోర్టు వీరి విడాకులను ఖరారు చేసిందని కొన్ని మీడియా కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు హన్సిక లేదా ఆమె కుటుంబ సభ్యులు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

హన్సిక మోత్వాని, సోహైల్ కతూరియా వివాహం 2022 డిసెంబర్ 4న రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఘనంగా జరిగింది. ఆ పెళ్లి వేడుక అట్టహాసంగా జరిగి అప్పట్లో సోషల్ మీడియాలో కూడా విస్తృతంగా చర్చకు దారితీసింది. పెళ్లి తర్వాత కొంతకాలం వరకు ఈ జంట సంతోషంగా జీవిస్తున్నట్లు కనిపించింది.

అయితే కొన్ని నెలల తర్వాత వీరిద్దరి మధ్య విభేదాలు ప్రారంభమైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరిగింది. గత కొంతకాలంగా హన్సిక తన భర్తకు దూరంగా ఉంటూ తల్లితో కలిసి నివసిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అదే సమయంలో హన్సిక తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి భర్తతో కలిసి ఉన్న కొన్ని ఫోటోలను తొలగించడం కూడా ఈ పుకార్లకు మరింత బలం చేకూర్చింది.

హన్సిక వివాహం సమయంలో కూడా కొన్ని వివాదాలు చర్చనీయాంశమయ్యాయి. సోహైల్ కతూరియాకు ఇది రెండో వివాహం కాగా, అతని మొదటి భార్య హన్సికకు సన్నిహిత స్నేహితురాలు అన్న వార్తలు అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ట్రోల్స్‌పై హన్సిక స్పందిస్తూ సోహైల్ గతం తనకు ముందే తెలుసని, వారి విడాకులకు తాను కారణం కాదని స్పష్టం చేసింది.

ఇప్పటివరకు హన్సిక, సోహైల్ విడిపోవడానికి గల ఖచ్చితమైన కారణాలు బయటకు రాలేదు. వ్యక్తిగత విభేదాల కారణంగానే ఈ జంట విడాకులు తీసుకున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో హన్సిక చేసిన తాజా పోస్ట్ ఆమె జీవితంలో కొత్త అధ్యాయానికి సంకేతంగా ఉందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in